ఎల్బీనగర్‌లో ఓటర్లు పెరిగారు!

- ఫైనల్ నోటిఫికేషన్ నాటికి ఓటర్ల సంఖ్య 5,66,185
- పురుషులు 2,96,018
- మహిళలు 2,70,697
- థర్డ్ జెండర్ ఓటర్లు 101
- 2018 ఎన్నికల్లో 4,01,137 మంది
- ప్రస్తుతం పెరిగి ఓటర్ల సంఖ్య 1,65,048

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజక వర్గంలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. ఈ నెల 4న ప్రకటించిన జాబితా ప్రకారం 5,66,185 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,96,018 , మహిళలు 2,70,697 మంది కాగా, థర్డ్ జెండర్ ఓటర్లు 101 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో యువ ఓటర్లు (18–19) సంవత్సరాలు ఉన్న వారు 8,566 మంది, దివ్యాంగులు 6,064 , 80 ఏళ్ల దాటిన వారు 8,385 మంది ఉన్నారు. సర్వీస్ ఓటర్లు 50 మంది కాగా, ఎన్‌ఆర్‌ఐకి చెందిన ఓటర్లు 12 మంది ఉన్నారు. పోలింగ్ స్టేషన్లు సుమారు 570 ఉన్నాయి.

నాడు.. నేడు ఓటర్ల వివరాలు ఇలా.....

2108లో జరిగిన ఎన్నికల్లో ఎల్‌బీనగర్ నియోజక వర్గంలో 4,01,137మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 2,11,895 మంది కాగా, మహిళలు 1,85,129 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం 2023 అక్టోబర్ నాటికి 5,66,185 మంది ఓటర్లు ఉన్నారు. అంటే గతంలో కంటే ఈసారి 1,65,048 మంది పెరిగారు. ఎన్నికల నామినేషన్ నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



ఎల్‌బీనగర్ మ్యాప్

ఎన్నికలకు టీమ్‌ల ఏర్పాటు...

ఎన్నికలు సజావుగా నిర్వహించేదుకు అన్ని ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి పంకజ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌తోపాటు వీడియో సర్వేయిలెన్స్ టీమ్స్ ఏర్పాటుతో పాటు ఎగ్జిట్ పోల్స్, ప్రభుత్వ భవనాలను రాజకీయ పార్టీలు వినియోగించకుండా, అనుమతి లేకుండా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై ప్రకటనలు రాయకుండా చర్యలు చేపట్టామని ఆర్‌ఓ పంకజ తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు అనుమతి లేకుండా వాహనాల్లో తిరగకుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే 040–24140937కు ఇవ్వాలని ఆమె కోరారు.

సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి

- సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- మలక్‌పేట నియోజకవర్గ ఆర్‌ఓ వెంకట ఉపేందర్‌రెడ్డి



చాదర్‌ఘాట్: ఎన్నికల అధికారుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించరాదని మలక్‌పేట నియోజకవర్గ ఆర్‌ఓ కె.వెంకట ఉపేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మలక్‌పేటలో మాట్లాడుతూ, ఎన్నికల నియమావళి డిసెంబర్ 5 వరకు అమలులో ఉంటుందన్నారు. సభలు, సమావేశాలకు ముందస్తుగా సువిధ యాప్‌లో అనుమతులు తీసుకోవాలన్నారు. నవంబర్ 3 నుంచి ఎన్నికల వ్యయ పరిశీలకుల బృందాలు రంగంలోకి దిగుతాయన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడ్ ఉల్లంఘనలు జరిగితే 1950 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సి విజిల్ యాప్ ద్వారా కోడ్ ఉల్లంఘన అంశాలు, లైవ్ ఫొటోలు, వీడియోలు తీసి ఈసీకి ఫిర్యాదు చేయవచ్చన్నారు. మతాలు, ప్రాంతాలు, వ్యక్తులను కించపరుస్తూ సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లపై వాటిని ముద్రించిన ప్రింటింగ్ ప్రెస్ పేరు, సెల్ నెంబర్ తదితర వివరాలు అచ్చు వేయాలని ఆర్‌ఓ వెంకట ఉపేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. కొత్తగా ఓటుహక్కు పొందేవారు ఫారం–6 నింపి ఈనెల 31లోగా అందజేయాలన్నారు.

తీగల ఆశీర్వాదం తీసుకున్న అజిత్‌రెడ్డి

మలక్‌పేట: బీఆర్‌ఎస్ మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి గురువారం నగర మాజీ మేయర్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో తన గెలుపునకు సహకారం అందించాలని కోరినట్లు అజిత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అభిషేకం, నాయకులు పీటర్, సాగర్, ప్రభు తదితరులు ఉన్నారు.



తీగల కృష్ణారెడ్డితో బీఆర్‌ఎస్ అభ్యర్థి అజిత్‌రెడ్డి, నాయకులు

క్లుప్తంగా

కాలనీ సమస్యలను పరిష్కరిస్తా



లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: కాలనీలో మౌలిక వసతులు కల్పించి సమస్యలు లేకుండా చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో సర్వే నెంబర్ 33, 59 నివాసితుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గురువారం వారు కార్పొరేటర్ లచ్చిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు ఆయను సన్మానించి కాలనీ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. ప్రతి సమస్య పరిష్కారమయ్యేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో కాలనీ అధ్యక్షుడు జగన్ రెడ్డి, శివా రెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'సీఎంఆర్‌ఎఫ్' దుర్వినియోగం చేశారని ఫిర్యాదు

చైతన్యపురి: అక్రమ ధ్రువీకరణ పత్రాలతో సీఎం రిలీఫ్ ఫండ్‌ను దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి గురువారం చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అత్త, మామలకు చికిత్స కోసం సరూర్‌నగర్‌లో తక్కువ ఆదాయం ఉన్నట్లు సర్టిఫికెట్ సాధించి సీఎంఆర్‌ఎఫ్ మంజూరు చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకే ఆయన బావమరిది సందీప్ రెడ్డి డైరెక్టర్‌గా ఉన్న ఓమ్ని ఆసుపత్రిలో ఎమ్మెల్యే అత్త, మామల చికిత్స కోసం రూ. 11 లక్షలు, రూ. 8 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారని ఆరోపించారు. సీఎం రిలీఫ్ ఫండ్ దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో వంగ కోరారు. కాగా, ఫిర్యాదును స్వీకరించామని, న్యాయ సలహా తీసుకుని తదుపరి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ నాగార్జున తెలిపారు.

మీడియా ఫైన్ ఆర్ట్స్ కోర్సుల్లో దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్‌లో వీకెండ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డబ్బింగ్ (రెండు నెలలు), విజువల్ ఆర్ట్స్(ఆరు నెలలు) ఫైన్ ఆర్ట్స్ వీకెండ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఉషాజ్యోతి మణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్: 97013 27539, 94417 68811 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రైలులో రూ.95వేలు చోరీ

కాచిగూడ: నగదు బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు గురువారం జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన మేరకు.. సోమాజిగూడ ప్రాంతానికి చెందిన రాజేష్ తన భార్యతో కలిసి లాల్‌ఘడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తున్నారు. నిజామాబాద్ – కామారెడ్డి రైల్వే స్టేషన్ల మధ్యన ఉండగా రూ.95వేల నగదు, దుబాయ్ కరెన్సీ ఉన్న బ్యాగును చోరీకి గురైంది. బాధితులు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

'ప్రజాసమస్యలను విస్మరించిన దానం'

కాచిగూడ: దానం నాగేందర్ ఎమ్మెల్యే అయిన తరువాత ప్రజా సమస్యలను పట్టించుకోలేదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి విమర్శించారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ



మొక్కల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రొఫెసర్ ప్రభాకర్, డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి

మలక్‌పేట: మొక్కలు ప్రకృతి ప్రసాదించిన వరమని, వాటిని పెంచితే అనేక విధాలుగా ఉపయోగపడతాయని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకర్ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ అనిబీసెంట్ ఉమెన్స్ కాలేజీలో గురువారం కాలేజీ బోటనీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రీన్‌డే' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, మొక్కలు మానవ జీవితంలో ముఖ్యమైన ప్రాత పోషిస్తాయన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మొక్కల ప్రాధాన్యతను వివరించారు. రకరకాల పండ్లు, పువ్వులు, కూరగాయలు, ఔషధ, ఇండోర్ మొక్కల ప్రదర్శన నిర్వహించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కాలేజీ సెక్రటరీ డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, డైరెక్టర్ దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేఖరెడ్డి, బోటనీ డిపార్ట్‌మెంట్ లెక్చరర్ అర్షియ ఆఫ్రీన్, రవీందర్ పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్య సాధనే లక్ష్యం: పీడీఎస్‌యూ

మలక్‌పేట: శాస్త్రీయ విద్య సాధనే లక్ష్యంగా పీడీఎస్‌యూ ముందుకు సాగుతోందని రాష్ట్ర అధ్యక్షుడు మామిడికాయల పరశురామ్ అన్నారు. గ్రేటర్ హైద్రాబాద్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం దిల్ సుఖ్‌నగర్ సాకేత డిగ్రీ కాలేజీలో పీడీఎస్‌యూ 49వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బిగి పిడికిలి జెండా ఎగురువేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తామని, విద్యార్థులను ప్రగతిశీల ఆలోచనల వైపు నడిపించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ కోసం 13 లక్షల మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంద నవీన్, పాడ పంగి నాగరాజు, నాయకులు రవీందర్, కీర్తి, శ్యామ్ సమీర్, మమత వైష్ణవీ, ప్రసాద్, వెంకటేష్, పవిత్ర, సునీల్ పాల్గొన్నారు.



పీడీఎస్‌యూ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న పరశురామ్ తదితరులు

దేవీనవరాత్రి ఉత్సవాల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న వంగ మధుసూదన్ రెడ్డి తదితరులు

హస్తినాపురం: విజయదశమి పండుగ సందర్భంగా కర్మన్‌ఘాట్ లోని శ్రీహరిహర క్షేత్ర అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో దేవీశరన్నవ రాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయంలో గురువారం ఆయన ఆలయ ట్రస్టీ మెంబర్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, దాతల సహకారంతో హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులతో బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామశరన్ శర్మ పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ కోశాధికారి కొక్కొండ సూర్యప్రకాశ్ గుప్తా, దసరా నవరాత్రి ఉత్సవాల కమిటీ చైర్మన్ మిరియాల అంజయ్య గుప్తా, సద్ది సందీప్ రెడ్డి, పేర్వాల మణిపాల్ రెడ్డి, లంకల రమేశ్‌రెడ్డి, బొడ్ల మల్లికార్జున్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్– సహారా రోడ్డును విస్తరించాలి

మన్సూరాబాద్: మన్సూరాబాద్–సహారా ప్రధాన రహదారిని వెంటనే విస్తరించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ రోడ్డులోని ఆయిల్ మిల్ వద్ద గురువారం హైదరాబాద్ మెట్రోవాటర్ వార్క్స్ వాహనం నడిరోడ్డుపై నిలిచిపోయి రోడ్డుకు ఇరువైపులా భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సీవరేజ్ బోర్డు వాహనాన్ని స్థానికులతో కలిసి పక్కకు నెట్టి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పెరుగుతున్న కాలనీలు, జనాభాకు అనుగుణంగా రోడ్డును విస్తరించాలని పలుమార్లు అధికారులను కోరినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మాస్టర్ ప్లాన్‌లో రోడ్డును 100 అడుగులకు విస్తరించాలని ఉన్నా.. అధికారులు కేవలం సర్వేలకే పరిమితమయ్యారన్నారు. అధికార పార్టీ నాయకులకు మద్యం, ఎలక్షన్‌పై ఉన్న శ్రద్ధ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంపై లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మన్సూరాబాద్– సహారా రోడ్డులో ఉన్న మద్యం దుకాణాల కారణంగా పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోందని, మద్యం దుకాణాలను రాత్రి 9 గంటలకే మూసి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీష్‌రెడ్డి, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.



సీవరేజ్ బోర్డు వాహనాన్ని రోడ్డుపై నుంచి స్థానికులతో కలిసి పక్కకు జరుపుతున్న కార్పొరేటర్

ధర్నాను తాత్కాలికంగా విరమిస్తున్నాం

- బండరావిరాల మైనింగ్‌జోన్ భూ నిర్వాసితులు
- 422రోజుల పాటు కొనసాగిన ధర్నా



ధర్నాకు దిగిన మైనింగ్ జోన్ భూ నిర్వాసితులు (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని బండరావిరాల మైనింగ్ జోన్ కోసం సర్వేనంబర్ 268లోని 1050 ఎకరాల భూమిని కోల్పోయిన బండరావిరాల, చిన్నరావిరాలకు చెందిన నిర్వాసిత రైతులు తమకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గత 422 రోజులుగా చేస్తున్న ధర్నాను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. తమనుంచి లాక్కున్న భూమికి బదులుగా భూమిని లేదా నష్టపరిహారం చెల్లించడంతో పాటు తమ గ్రామంలో ఏర్పాటు చేసిన మైనింగ్ జోన్‌ను ఎత్తివేయాలని అలాగే కొత్తగా క్రషర్లకు అనుమతులు ఇవ్వకూడదంటూ బాధిత రైతు నేతి క్రిష్ణయాదవ్ ఆధ్వర్యంలో 159మంది రైతు కుటుంబాలు ఏడాదిన్నర క్రితం సద్దుపల్లి కూడలిలో ధర్నాను ప్రారంభించిన విషయం తెలిసిందే. గత 422 రోజులుగా మంత్రులు, ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లినా స్పందించకపోవడం దారుణమని పేర్కొంటున్న రైతులు ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న ఎన్నికల కోడ్ అమలు కారణంగా స్థానిక పోలీసుల సూచన మేరకు ధర్నాను తాత్కాలికంగా ఎన్నికలు ముగిసే వరకూ విరమించుకుంటున్నామని, ఎన్నికల అనంతరం ఏ ప్రభుత్వం వచ్చినా కూడా తమకు న్యాయం జరిగేంత వరకూ తమ ధర్నాను కొనసాగిస్తామని తెలిపారు. రైతులు పావురాల ఐలయ్య, గంగయ్య, యాదగిరి, నరేష్, మణెమ్మ, ఐలమ్మ, వెంకటమ్మ, బాలమ్మ, రైతు కుటుంబ సభ్యులు ప్రకటించారు.

కేన్సర్‌కు భయపడొద్దు



కేన్సర్ రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు మినాజుద్దీన్, షాహిద్

చంచల్‌గూడ: కేన్సర్ వచ్చిందని భయపడొద్దని, ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే తగ్గిపోతుందని బీబీ కేన్సర్ ఆసుపత్రి హెచ్‌ఓడీ సీనియర్ అనస్థీషియా వైద్యుడు డాక్టర్ సజ్జాద్ తెలిపారు. పొగాకు వినియోగంతో పురుషులు కేన్సర్ బారిన పడుతున్నారని, రొమ్ము కేన్సర్‌తో మహిళలు బాధపడుతున్నారని అన్నారు. రొమ్ము కేన్సర్‌తో బాధపడుతున్న మహిళల సంఖ్య నానాటికీ పెరుగుతోందన్నారు. అక్టోబర్ నెలను రొమ్ము కేన్సర్ అవగాహన నెలగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్లు మినాజుద్దీన్, షాహిద్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని కేన్సర్ బాధితులకు ధైర్యం చెప్పి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ సమీర్, వైద్యులు వికాస్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

తాగి డ్రైవింగ్ చేసిన ఆరుగురికి జైలు.. మరో ఆరుగురికి జరిమానా

మలక్‌పేట: మలక్‌పేట ట్రాఫిక్ పీఎస్ పరిధిలో చేపట్టిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12 మంది వాహనదారులను గురువారం నాంపల్లి డీడీ కోర్టులో హాజరు పరిచినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిలో 10 మంది ద్విచక్ర వాహనదారులు, ఇద్దరు ఆటో డ్రైవర్లు ఉన్నారు. న్యాయమూర్తి వీరిలో ఆరుగురికి రూ. 2100 చొప్పున జరిమానా విధించారని, మరో ఆరుగురికి జైలు శిక్ష , జరిమానా విధించారని పోలీసులు తెలిపారు. కారాగార శిక్ష పడిన వారిలో ఐదుగురు రెండుసార్లు పట్టుబడగా ఒక్కొక్కరికి రూ.3300 జరిమానాతో పాటు 4 రోజులు జైలు, మొదటిసారి పట్టుబడిన వ్యక్తికి రూ.2100 జరిమానా, 2 రోజుల జైలుశిక్ష పడిందన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఐదుగురి అరెస్టు

నాగోలు: ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కాలనీలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 37.75 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మన్సూరాబాద్, సాయినగర్ కాలనీ చెందిన వర్ధం రాజు, సాయి సప్తగిరి కాలనీ చెందిన కర్రి సాయిరెడ్డి, భరత్‌నగర్ కాలనీ చెందిన కోరె యాదయ్య, ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కేతావత్ సుజాత, హస్తినాపురం కేశవపురి కాలనీ చెందిన పుచ్చల జగత్‌రెడ్డిలు వివిధ ప్రాంతాల నుంచి అక్రమంగా మద్యం తీసుకు వచ్చి మద్యం అమ్ముతున్నారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు వారి నివాసంపై బుధవారం, గురువారం దాడి చేసి వారి వద్ద నుంచి 37.75 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ 30.346 ఉంటుందని పోలీస్‌లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బీజేపీకి ఉనికిలేదు.. కాంగ్రెస్‌కు కేడర్ లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పది కోట్ల రూపాయలతో బంజారా భవనం నిర్మించారని, తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత ఆయనకే దక్కిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్‌లోని వంగ శంకరమ్మ గార్డెన్స్‌లో నిర్వహించిన గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో ఎన్నికలు ఏవైనా విజయం బీఆర్‌ఎస్ పార్టీదేనని, అన్ని సర్వేలు ఇదే విషయాన్ని చెబుతున్నాయని, రాష్ట్రంలో మూడవసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం బీజేపీకి ఉనికి లేదు, కాంగ్రెస్ పార్టీకి కేడర్ లేదని సుధీర్‌రెడ్డి అన్నారు. 2014లో ఉద్యమ నాయకుడికి ప్రజలు పట్టం కట్టారని, తొమ్మిదేళ్లలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించిందని అన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని, రైతులకు రెండుసార్లు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్‌దేనని అన్నారు. కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి సిద్ధం

- ఖరారు కాని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు
- ఆశావహుల్లో ఉత్కంఠ

ఎల్‌బీనగర్: ఒకవైపు బతుకమ్మ పండుగ, మరోవైపు దసరా, దీపావళి పర్వదినాలు సమీపిస్తున్న తరుణంలో కాస్త ఇటో.. అటో ఓట్ల సంబురం ఉంటుంది. ఎన్నికల సందర్భంగా పోటీ చేయాల్సి అభ్యర్థులు వచ్చే నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు వేయాల్సి ఉంటుంది. అంటే ఎవ్వరు ఇక్కడ నుంచి పోటీ చేస్తారో తేలిపోతుంది. అధికార పార్టీ ఇప్పటికే ఎల్‌బీనగర్‌లో పోటీ చేసే అభ్యర్థిని ప్రకటించింది. ఇక హస్త వాసిని చాటుకునేందుకు, కమలాన్ని దక్కించుకొనేందుకు ఆశావహులు టికెట్ల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

సమీపిస్తున్న గడువు...

బీఆర్‌ఎస్ పార్టీ అధికారికంగా ప్రకటించిన అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఇప్పటికే అధికార కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్లారు. కోడ్ కూసిన వేళలో కాలనీలో ప్రజలతో, కులసంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి ఓటర్లుగా దగ్గరవుతున్నారు. ఇక బీజేపీ అభ్యర్థిని ప్రకటించకున్నా ఆశావహులు సామ రంగారెడ్డి స్థానిక కార్పొరేటర్ల సహకారంతో కాలనీలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. – ఇక కాంగ్రెస్ పార్టీ నేత మధుయాష్కి గౌడ్ తనకే టికెట్ దక్కుతుందనే నమ్మకంతో నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గాల వారితో అంతర్గత సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ టికెట్లపై పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కసరత్తు తుది దశకు చేరిందని తెలుస్తుండగా, ఎన్నికల సమయం దగ్గర పడుతుండంతో అన్ని కాలనీలోని ప్రజలను కలువలేక పోతామేమోనని ఆందోళనలో ఉన్నారు.

కమలం ఆచి.. తూచి

ఎల్‌బీనగర్ నుంచి బీజేపీ తరఫున పోటీ చేసే అభ్యర్థిగా చాలా కాలంగా అనుకుంటున్న సామ రంగారెడ్డి పేరు అధిష్టానం పరిశీలిస్తోందని తెలుస్తోంది. ఇప్పటికే నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసిన తప్పులను ప్రజల ముందుకు తీసుకెళ్తున్న సామ .. మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ బీజేపీని గెలిపించాలని వేడుకుంటున్నాడు.

ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్...

ఇక్కడ నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులు తేలకపోవడంతో ఇప్పటికే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు మాత్రం ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ కార్డుల గురించి వివరిస్తున్నారు. ప్రధానంగా ఎల్‌బీనగర్ టికెట్ పంచాయితీ ఢిల్లీకి చేరిన తర్వాత ఆశావహులు మాత్రం ప్రచారంలో కాస్త వెనుకడుగు వేసినట్టు తెలుస్తోంది. మాజీ ఎంపీ మధు యాష్కిగౌడ్ ఇక్కడ నుంచి పోటీ చేయాలనే ఆలోచన వల్ల కాంగ్రెస్ పార్టీలో అయోమయం నెలకొంది. అభ్యర్థి ఎవ్వరనేది తేలకపోవడంతో పార్టీ కేడర్‌లో కొంత నిరాశ ఉన్నట్టు తెలుస్తోంది.

స్వచ్ఛ భారతదేశం మనందరి బాధ్యత

జీఎస్‌ఐ డీడీజీ డాక్టర్ మాథ్యూ జోసెఫ్

మన్సూరాబాద్: పచ్చదనం, ఆరోగ్యం, స్వచ్ఛ భారతదేశం మనందరి బాధ్యతగా భావించాలని జీఎస్‌ఐ డీడీజీ డాక్టర్ మాథ్యూ జోసెఫ్ అన్నారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (జీఎస్‌ఐటీఐ)లో ఫిట్ ఇండియా స్వచ్ఛత స్వేచ్ఛ రన్ 4.0ను గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన రన్‌ను ప్రారంభించి ఉద్యోగులతో కలిసి రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీడీజీ మాట్లాడుతూ, ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 2020లో రూపొందించారని, 2023లో 4వ విడత రన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. శారీరక, మానసిక ఉల్లాసానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. రన్‌లో పీఆర్‌ఓ డాక్టర్ గంజి మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్‌లో పాల్గొన్న జీఎస్‌ఐ డీడీజీ మాథ్యూ జోసెఫ్, ఉద్యోగులు